# ఆటలే ఆరోగ్యానికి బాటలు



ర్యాలీలో వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, జేసీ శ్యాంప్రసాద్



పల్నాడు రోడ్డులో ర్యాలీ

- విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా దోహదం
- మున్సిపల్ కార్యాలయం నుంచి ఎస్.ఎస్.ఎన్ కాలేజ్ వరకు భారీ ర్యాలీ
- పాల్గొన్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే గోపిరెడ్డి
- పలు ప్రదర్శనలు, క్రీడలతో ఆకట్టుకున్న విద్యార్థులు

**నరసరావుపేట:** దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున వినూత్న రీతిలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలు ద్వారా విద్యార్థులకు ఆరోగ్యంతో పాటు శారీరక దృఢత్వం లభిస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి వినూత్న రీతిలో జిల్లాలో ప్రచారం కల్పించేందుకు శుక్రవారం క్రీడా సంబరాలతో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాల వరకు కొనసాగింది. ర్యాలీని జేసీ, ఎమ్మెల్యే ప్రారంభించి, విద్యార్థులతో కొనసాగారు. దారి పొడవునా విద్యార్థులు, క్రీడాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు, మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలు, వాలీబాల్, కోలాటం, పిరమిడ్స్ వంటి ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. వాలీబాల్ ఆటను క్రీడాకారులతో కలసి ఇద్దరూ ఆడారు. ఈ సందర్భంగా జేసీ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద యువకుల్లో క్రీడా స్ఫూర్తిని రగిలించి ఉత్తమ క్రీడాకారుల్ని తయారు చేయడం లక్ష్యంగా ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించిందని వివరించారు. పోటీలు మొత్తం ఐదు విభాగాల్లో ఈనెల 26 నుంచి 47 రోజులపాటు సచివాలయాలు, మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో జరుగుతాయని తెలిపారు. క్రీడల కోసం పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యాశాఖ, స్పోర్ట్స్ అథారిటీస్ శాఖలను సమన్వయ పర్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఈ పోటీలకు మంచి ప్రచారం లభిస్తుందని, మేలైన క్రీడాకారుల్ని తయారు చేయడానికి ఇది ఒక అద్భుతమైన అవకాశమని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, డీడీవో మహాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, క్రీడాశాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**నరసరావుపేట:** స్థానిక పార్టీ కార్యాలయంలో ఐదుగురు వ్యక్తులకు రూ.4.65లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం సాయంత్రం పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఈ ఐదుగురు తమకు ఆర్థిక సాయం చేయాలని సీఎం పేషీకి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎం సహాయనిధి సంస్థ నిధులు మంజూరు చేసింది.

### చెకుముకి పోటీల్లో గణపవరం విద్యార్థుల ప్రతిభ



**నాదెండ్ల:** మండల స్థాయి చెకుముకి పోటీల్లో గణపవరం శ్రీ కెల్లంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సైన్స్ చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని 15 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కార్తీక్‌రెడ్డి, సాత్విక, జగన్‌మోహన్‌రెడ్డి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థుల్ని హెచ్‌ఎం కృష్ణానాయక్, సైన్స్ ఉపాధ్యాయులు పి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

### సాతులూరు విద్యార్థికి బహుమతి



**నాదెండ్ల:** సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి శుక్రవారం జేసీ శ్యాంప్రసాద్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్ని పురస్కరించుకుని గత నెల రోజులుగా అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించిన విషయం విదితమే. వినియోగదారుల చట్టంపై అవగాహన కార్యక్రమాలు, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో సాతులూరు హైస్కూలుకు చెందిన పి. పూర్ణమనోహర్ ప్రతిభ కనబరిచాడు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జేసీ నుంచి బహుమతి అందుకున్నాడు. కార్యక్రమంలో డీఎస్‌వో పద్మ శ్రీ, జిల్లా వినియోగదారుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ మురికిపూడి ప్రసాద్, సభ్యులు విద్యాసాగర్, నాయక్, విక్రం పాల్గొన్నారు.

### రైతులకు ఉపకరించే పనులనే గుర్తించాలి

డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



**నరసరావుపేట రూరల్:** రైతులకు ఉపకరించేలా ఉపాధి హామీ పథకంలో నూతన పనుల్ని గుర్తించాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగవరపు జోసఫ్‌కుమార్ తెలిపారు. పనులు గుర్తించడంపై ఫీల్డ్ అసిస్టెంట్లకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాలకు చెందిన సిబ్బంది హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ నవంబర్‌లో నిర్వహించిన గ్రా మసభ తీర్మానాల్ని అనుసరించి డిసెంబర్, జనవరి నెలల్లో ఆయా పనుల్ని గుర్తించాలని తెలిపారు. గతంలో నిర్వహించిన పనులు కాకుండా నూతనంగా గుర్తించాలని, తద్వారా గ్రామానికి సంపద కల్పించబడుతుందని వివరించారు. నూతనంగా కుంటలు, చెక్ డ్యామ్‌లు ఏర్పాటు, పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా నారాయణ, నాగశ్రీనివాస్, బుచ్చిబాబు వ్యవహరించారు. పలు మండలాల ఏపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

### వివాహిత ఆత్మహత్య

**చిలకలూరిపేట టౌన్:** క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని శాంతీనగర్‌కు చెందిన సెంట్రింగ్ పనుల చేసుకునే ఉప్పుతాళ్ల గోపీతో రాజుపాలెం మండలం ఇనిమెట్ల గ్రామానికి చెందిన త్రివేణికి నాలుగేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక బాబు ఉన్నాడు. వీరు వేరుగా ఇల్లు తీసుకుని నివాసం ఉంటున్నారు. ఇటీవల గోపీ, అతని కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఉండాలని నిర్ణయించారు. దీనికి మనస్తాపం చెందిన త్రివేణి(25) ఇంట్లో ఇనుప కడ్డీకి చీరెతో ఉరి వేసుకుంది. గమనించిన మామ ఆమెను ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. త్రివేణి తల్లి శివపార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అర్బన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు




సాంస్కృతిక ప్రదర్శలు నిర్వహిస్తున్న విద్యార్థులు

**వినుకొండ(నూజెండ్ల):** పట్టణంలోని గీతాంజలి స్కూలులో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘ నంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ఎండ్లూరి శేషగిరిరావు చిన్నారులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రేమ, శాంతి, దయ, క్షమాపణ వంటి అత్యున్నతమైన లక్షణాలు బోధించిన యేసుక్రీస్తు జీవితం ఎంతో ఆదర్శమన్నారు. అనంతరం కేక్ కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. మరియమ్మ, యోసేపు, జ్ఞా నులు, గొల్లలు, దేవదూతల వేషధారణలతో విద్యా ర్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమా లు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.కృష్ణవేణి, కరస్పాండెంట్ వై.లక్ష్మణకిశోర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కష్టాల్లో ఉన్న వారిని ప్రేమించాలన్నదే క్రీస్తు మార్గం**

**చిలకలూరిపేట:** కష్టాల్లో ఉన్న వారిని ప్రేమించాలని క్రీస్తు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. ఏఎంజీ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాంగణంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు జననం సమస్త మానవాళి రక్షణ కోసమే అని తెలిపారు. ఫార్ కార్నర్స్ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జెస్సీ ఎస్ బర్నబాస్ మాట్లాడుతూ క్రీస్తు ప్రేమను ఎరిగినందునే డాక్టర్ ఎస్. జాన్‌డేవిడ్ ఏఎంజీ వంటి స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేసి ఎందరో అన్నార్తుల్ని ఆదుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాస్టర్ డి. ప్రభుదాసు దేవ సందేశాన్ని అందించారు.

## రామానుజన్ జీవితం విద్యార్థులకు ఆదర్శనీయం

పలు పాఠశాలల్లో జాతీయ గణిత దినోత్సవం



రామకృష్ణ ఓరియంటల్ స్కూలులో రామానుజన్‌కు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థులు చిత్రించిన గణిత చార్ట్‌లను పరిశీలిస్తున్న ఎంఈవో సాంబశివరావు



వేల్పూరు హైస్కూలులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు



గణపవరం జెడ్పీ హైస్కూలులో విజేతలైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**నరసరావుపేట/వినుకొండ(నూజెండ్ల)/శావల్యాపురం/నాదెండ్ల:** స్థానిక బరంపేటలోని శ్రీ రామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రఖ్యాత భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సత్యనారాయణసింగ్ అధ్యక్షతన రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రామానుజన్ గణిత శాస్త్రవేత్తగా ఎదిగిన తీరు, జీవిత విశేషాలు, చదువులో గణిత శాస్త్రం ప్రాధాన్యత గురించి గణిత ఉపాధ్యాయురాలు శ్యామల వివరించారు. మరో ఉపాధ్యాయురాలు విప్లవ జ్యోతి విద్యార్థులతో గణిత గీతం పాడించి, గణిత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు తాము రూపొందించిన గణిత నమూనాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

- నూజెండ్ల మండలంలోని ప్రకాష్‌నగర్ కాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో సాంబశివరావు పాల్గొన్నారు. విద్యార్థులకు గణిత దినోత్సవం, రామానుజన్ జీవిత విషయాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులు గీసిన గణిత చార్ట్‌లు, మోడల్స్ ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రవిచంద్ర, సురేష్, పంచాయతీ సెక్రటరీ రాంబాబు, హెచ్‌ఎం గంటా నాగేశ్వరరావు, టీచర్ కొండలరావు, సీఆర్పీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.
- మండలంలోని వేల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ భారతీయ గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ జయంతిని పురస్కరించుకొని క్విజ్, చెస్ పోటీలు, సుడుకో, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు సంద్రపాటి చలపతిరా వు, హెచ్‌ఎం సుభాని, రఘునాథబాబు, త్రిపురసుందరి, జె.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.
- గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం శ్రీ శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి హెచ్‌ఎం ఐ. కృష్ణానాయక్ అధ్యక్షత వహించారు. శ్రీనివాసరామానుజన్ గణిత శాస్త్రంపై చేసిన పరిశోధల్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి. ఉషారాణి, కె. శ్రీనివాసరావు, పద్మావతి, ఎల్. నాగేశ్వరరావు, పీఈటీ జాస్తి శ్రీకాంత్ పాల్గొన్నారు.

### డాక్టర్ యజ్ఞనారాయణరెడ్డి మృతి



**నరసరావుపేట:** పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.యజ్ఞనారాయణరెడ్డి (62) శుక్రవారం మృతి చెందారు. గత నాలుగు నెలల నుంచి ఆయన క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాదులో చికిత్స తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియచేశారు. కాగా, మృతి చెందిన యజ్ఞనారాయణరెడ్డి టీటీడీ మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డికి సమీప బంధువు. భౌతికకాయానికి శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)కు చెందిన పలువురు డాక్టర్లు సంతాపం వెల్లడించారు.

## ‘ఆడుదాం ఆంధ్రా’లో యువత ఉత్సాహంగా పాల్గొనాలి



నూజెండ్లలో జరిగిన ర్యాలీలో అధికారులు



యడ్లపాడులో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ ఝాన్సీ, మండల ప్రత్యేక అధికారి రాధారాణి తదితరులు



నాదెండ్లలో ర్యాలీ ప్రారంభిస్తున్న ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, ప్రత్యేకాధికారి బెన్ని

**వినుకొండ(నూజెండ్ల):** ఆడుదాం ఆంధ్రాలో యువత ఉత్సాహంగా పాల్గొనాలని నూజెండ్ల మండల ప్రత్యేక అధికారి ఏడీఏ బోయపాటి రవిబాబు తెలిపారు. క్రీడా ఏర్పాట్లపై నూజెండ్ల గ్రామ సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రాష్ట్రంలోని క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ అందించే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. ఇందులో భాగంగా గ్రామీణ క్రీడాకారుల్లోని సత్తాను వెలుగులోకి తెచ్చేలా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో ఐదు క్రీడాంశాల్లో 3187మంది క్రీడాకారులు నమోదైనట్లు తెలిపారు. జట్టుల ఎంపిక, క్రీడా సామగ్రి పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానాన్ని పరిశీలించి సూచనలు చేశారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం రవ్వవరంలో అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో పంట నష్టం వివరాల నమోదుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.వీరభద్రాచారి, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ రవికుమార్, స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ రత్నం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇన్నాయమ్మ, ఏపీవో నాగేశ్వరరావు, ఏఈవో ఎలీషా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

**యడ్లపాడులో...**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ఆడుదాం ఆంధ్రా’ పోటీలు విజయవంతం చేసేందుకు అంతా సహకరించాలని ఎంపీపీ పిడతల ఝాన్సీ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి రాధారాణి అధ్యక్షతన పోటీల నిర్వహణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 26న గ్రామ సచివాలయ పరిధిలో ప్రారంభమయ్యే ఈ పోటీలకు ఇప్పటికే 165 మందికి పైగా పేర్లను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని తెలిపారు. ఇంకా ఆసక్తి కలిగిన వారు చేసుకోవచ్చని సూచించారు. పండగ వాతావరణంలో పోటీల నిర్వహణకు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆమె సూచిచారు. సచివాలయ స్థాయిలో డిసెంబర్ 26 నుంచి 2024 జనవరి 9 వరకు, 10 నుంచి 23 వరకు మండలస్థాయి, 24 నుంచి 30 వరకు నియోజక వర్గస్థాయి, జిల్లాస్థాయిలో 31 నుంచి ఫిబ్రవరి 5 వరకు, రాష్ట్రస్థాయిలో 6 నుంచి 10 వరకు కొనసాగుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై. హనుమారెడ్డి, సర్పంచ్ కె. హేమ, ఉన్నవ జెడ్పీ హైస్కూల్ పీడీ, స్పోర్ట్స్ అథారిటీ మండల కో–ఆర్డినేటర్ మాధురి రాణి, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**నాదెండ్లలో..**

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో విద్యార్థులు సత్తా చాటి తమ పాఠశాల పేరు నిలపాలని మండల ప్రత్యేకాధికారి బి.జె.బెన్ని చెప్పారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ఆడుదాం ఆంధ్రాపై అవగాహన కార్యక్రమం అనంతరం అధికారులు, విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పోటీల్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంఈవోలు ఆంజనేయులు, కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారుతీబాబు, ఏపీఎం సాంబశివరావు, ఎస్‌హెచ్‌సీ గ్రూపు సభ్యులు, మహిళా పోలీసులు, వలంటీర్లు పాల్గొన్నారు.

### మిర్చిలో తక్షణ సస్యరక్షణ అవసరం

**రొంపిచర్ల:** ప్రస్తుత తరుణంలో మిర్చి సాగుచేస్తున్న రైతులు కనీస జాగ్రత్తలు పాటించాలని ఉద్యాన శాఖాధికారి నవీన్ కుమార్ సూచించారు. మిచాంగ్ తుపానుకు నీరు నిలిచి పోయిన పొలాల్లో వేరు కుల్లుడు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నివారణకు లీటరుకు 2 గ్రాముల చొప్పున రెడోమిల్ మందును కలిపి వేరు వ్యవస్థ తడిచే విధంగా మొక్కల మొదళ్లలో పోయాలని తెలియజేశారు. మొక్కలు ఎదిగేందుకు పైపాటుగా లీటరు నీటికి 5గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రెండవ విడతగా 13–0–45 మందుతో పాటు ఫార్ములా 4ను కలిపి పిచికారి చేయాలన్నారు. ప్రస్తుత తరుణంలో మిర్చి పంటపై అమరావతి పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడా నల్ల తామర పురుగు కనబడుతోందని, దీన్ని రైతులు నల్ల నల్లిగా భావించి మందులు పిచికారీ చేస్తున్నారని తెలిపారు. నల్లతామర పురుగు కనిపిస్తే నివారణకు అవసరమైన మందులు పిచికారి చేయాలని నవీన్ కుమార్ రైతులకు సూచించారు.

### హెచ్‌ఆర్‌ఏ పెంపుపై పీఆర్‌టీయూ హర్షం

**నాదెండ్ల:** చిలకలూరిపేట మున్సిపాలిటీ పరిధిలో ఎనిమిది కిలోమీటర్ల లోపున్న ఉద్యోగులకు ప్రభుత్వం కొత్త సంవత్సరం కానుకగా హెచ్‌ఆర్‌ఏ 12 శాతం పెంచడంపై పీఆర్‌టీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. చిలకలూరిపేట మున్సిపాలిటీలో విలీనమైన గణపవరం నుంచి నాదెండ్ల, యడ్లపాడు గ్రామాల్లోని పలువురు ఉద్యోగులకు వర్తించనుంది. రోడ్లు, భవనాల శాఖ జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్వే నివేదిక మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి నోటిఫికేషన్ విడుదల కావడంతో రెండు మండలాల్లో పనిచేస్తున్న అన్ని శాఖల ఉద్యోగులకు గతంలో ఉన్న 10 శాతం హెచ్‌ఆర్‌ఏ 12 శాతం పెరగనుంది. సుమారు 200 మందికి పైగా ఉద్యోగులకు రూ.500 నుంచి రూ.2,500 వరకు లబ్ధి లబ్ధి చేకూరనుంది. హర్షం వ్యక్తం చేసిన వారిలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంమోజేష్, ఎం. వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు సి.వి.ఎస్. మణి, ప్రసాద్, సంపూర్ణరావు, శ్రీనివాస్, షేక్ ఖాజావలి, ఎస్. అమర్‌నాథ్ ఉన్నారు.

### భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు



**శావల్యాపురం:** మండలంలోని కనమర్లపూడిలో పోలేరమ్మ, అద్దంకమ్మ, పెద్దమ్మ, కనకమ్మ దేవాలయాలు 41 రోజుల ప్రతిష్ట వేడుకలు ముగింపు సందర్భంగా శుక్రవారం బోనాల వేడుకలతో పాటు హోమాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. కనకతప్పెట్లు, మేళతాళాల నడుమ బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

### ఉన్నతి పథకంపై ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ



ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అధికారులు

**శావల్యాపురం:** మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉన్నతి పథకంపై ఉపాధి హామీ సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో సీతా రామయ్య మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో వంద రోజుల పని దినాలు పూర్తి చేసిన ఉపాధి హామీ పథకం కూలీల్ని గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ శ్రీలక్ష్మి, జిల్లా కో– ఆర్డినేటర్ కరుణాకర్, సాంకేతిక సహాయకురాలు రోజారాణి పాల్గొన్నారు. అనంతరం ఉన్నతి పథకంలో వంద రోజులు పని దినాలు పూర్తి చేసిన కూలీలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

## వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి



ఖాదర్ బాషాను సన్మానించిన నాయకులు, కార్యకర్తలు

**నరసరావుపేట:** స్థానిక వెంగళరెడ్డి కాలనీలో శుక్రవారం రాష్ట్ర మైనార్టీ సెల్ సెక్రెటరీగా నియమితులైన షేక్ ఖాదర్ బాషాను ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ పెద్ద ఖాజా, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు సయ్యద్ ఫాతిమాతో పాటు డ్వాక్రా మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ నాయకులు శాలువా కప్పి, పూలదండలు వేసి ఘనంగా సన్మానించారు. పార్టీ అభివృద్ధికి, వై.ఎస్. జగన్‌మోహనరెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి పాటు పడతానని తెలిపారు. రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శి పాలపర్తి సామ్రాజ్యం, జిల్లా ఎస్సీ సెల్ విజిలెన్స్ మెంబర్, పట్టణ ఎస్సీ సెల్ కన్వీనర్ మల్లెల అశోక్, 32వ వార్డు ఇంచార్జ్ షేక్ నాగుల్‌మీరా, మాజీ కౌన్సిలర్ బత్తుల పద్మలత, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ జాతీయ నాయకులు పొనుగుబాటి పూర్ణచంద్రరావు, ఆరో వార్డు నాయకులు రాజా, షేక్ బాబు పాల్గొన్నారు.

## గుంటూరు క్రికెట్ క్లబ్ జట్టు విజయం



సిద్ధిఖ్‌కు ట్రోఫీ అందజేస్తున పఠాన్ బాషా

**నరసరావుపేట:** స్థానిక ఎస్‌కేఆర్‌బీఆర్ కళాశాలలోని ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఫుల్ మెంబర్ క్లబ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 14ఏళ్లలోపు బాలుర ప్రెసిడెంట్ కప్ పోటీలో గుంటూరు క్రికెట్ క్లబ్ జట్టు 100 పరుగుల తేడాతో విజయం సాధించింది. గుంటూరు క్రికెట్ క్లబ్, రెస్ట్ ఆఫ్ క్లబ్స్ క్రికెట్ క్లబ్ మధ్య శుక్రవారం మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు క్రికెట్ క్లబ్ జట్టు నిర్ణీత 40 ఓవర్లలో రెండు వికెట్లు నష్టానికి 233 పరుగులు చేసింది. ఈ జట్టులోని యాసిన్ సిద్దిక్ 93 పరుగులు, హర్ష 51, భవీష్ 45పరుగులు చేయగా రెస్ట్ ఆఫ్ క్లబ్స్ జట్టులోని వర్ధన్ ఒక వికెట్ సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన రెస్ట్ ఆఫ్ క్లబ్స్ జట్టు 3.4 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ జట్టులో తమన్‌రెడ్డి మాత్రమే ఒంటరి పోరాటం చేసి 81 పరుగులు సాధించారు. గుంటూరు క్రికెట్ క్లబ్‌లోని గణేష్ రామ్ ఐదు వికెట్లు సాధించాడు. యాసిన్ సిద్దిక్‌కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతిని సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు పఠాన్ బాషా అందించారు. మ్యాచ్‌లను ఎ.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

## పేద విద్యార్థుల ఉన్నతికి ప్రభుత్వం ప్రాధాన్యం



యడ్లపాడు జెడ్పీ హైస్కూల్లో ట్యాబ్‌ల పంపిణీ

**యడ్లపాడు:** పేద విద్యార్థుల ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీపీ పి. ఝాన్సీ సూచించారు. మండలంలోని సొలస, లింగారావుపాలెం, ఉన్నవ, సందెపూడి, యడ్లపాడు, తిమ్మాపురం, జగ్గాపురం తదితర గ్రామాల్లోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు శుక్రవారం ట్యాబ్‌లు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవి ఉన్నత శిఖరాల్ని అధిరోహించాలని సూచించారు. ఎంఈవో -1, 2 నాగరత్నం, అరుణకుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో సర్పంచులు కె. హేమ, షేక్ కరీమూన్, ఎంపీటీసీ సభ్యుడు తోకల వీరరాఘవయ్య, గ్రామ పెద్దలు ఆలోకం వెంకటలక్ష్మీనారాయణ, కృష్ణారావు, గోగడ హరిబాబు, నంబూరి వెంకయ్య, శివరామకృష్ణ, తోకల సత్యనారాయణ, మీరావలి, హెచ్‌ఎంలు విజయభారతి, కె.వి. రామిరెడ్డి పాల్గొన్నారు.